క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన డీఎస్పీ



ఉపముఖ్యమంత్రి రాజన్నదొరను కలిసిన డీఎస్పీ

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొరను పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణంరాజు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రిని ఆయన స్వగృహంలో కలిసి దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పాలకొండ నియోజకవర్గంలోని బత్తిలిలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవన ప్రారంభోత్సవానికి ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొరకు డీఎస్పీ ఆహ్వానం పలికారు.

ఘనంగా అయ్యప్పస్వామి పూజ



అయ్యప్పస్వామికి పూజచేస్తున్న భక్తుడు గణేష్

మక్కువ: అయ్యప్పస్వామి భక్తులు స్థానిక ఆలయంలో ఆదివారం పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి మాల ధరించిన బొంగు గణేష్‌స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు స్వామిని కడియం పువ్వులతో అలంకరించారు. అలాగే భజన కార్యక్రమం నిర్వహించారు. స్వాములకు అన్న సమ్మారాధన చేపట్టారు. వేదపండితుడు అరవెల్లి విజయకుమార్ శర్మ, గురుస్వామి కాళహస్తి శ్రీనివాసరావు స్వాములను దుశ్శాలువలతో సత్కరించారు.

పిక్నిక్ సందడి



వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణం సమీప మామిడితోటలో జరిగిన పిక్నిక్

సీతానగరం: కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సువర్ణముఖి నదీ తీరాన ఉన్న తోటలలో పిక్నిక్ సందడి నెలకొంది. స్థానిక వేణు గోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో గల మామిడి తోటలో మహిళలు, విద్యార్థులు పిక్నిక్ ఏర్పాటు చేసుకున్నారు. అలాగే జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయం ప్రాంగణంలో ప్రిన్సిపాల్ పి.వెంకటినాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బంది ఆనందోత్సాహాలతో పిక్నిక్‌లో పాల్గొన్నారు.

దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

గరుగుబిల్లి: ప్రతిఒక్కరూ తమ స్మార్ట్‌ఫోన్‌లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పార్వతీపురం దిశ ఎస్‌ఐ డి.సంతోషికుమారి సూచించారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో దిశ యాప్ వినియోగం, దాని ప్రయోజనాలపై విద్యార్థులకు ఆదివారం అవగాహన కల్పించారు. పురుషులు, మహిళలు ఇద్దరికీ ఇది ఉపయుక్తమేనన్నారు. ఆపద సమయంలో యాప్‌ను సంప్రదిస్తే 10 నిమిషాలలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, రక్షణ కల్పిస్తారన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

పాలకొండ రూరల్: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆదివారం నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. డిప్యూటీ డీఈవో పల్రి కృష్ణారావు ఆయా పరీక్షా కేంద్రాలను సందర్శించి, విద్యార్థులు రాస్తున్న పరీక్షల తీరును పరిశీలించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు సంబంధించిన ఈ పరీక్షకు 544 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి స్కాలర్‌షిప్ అందిస్తారు.

12న మహా అన్నదానం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి సిరిమానోత్సవం తర్వాత ఆలయ ఆవరణలో నిర్వహించే భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేఎల్.సుధారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న మంగళవారం నిర్వహించాల్సిన అన్నదాన కార్యక్రమం తుఫాన్ హెచ్చరికల కారణంగా రద్దు చేసి 12న నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులందరూ విషయాన్ని గ్రహించాలని కోరారు.

ఘనంగా ముస్లిం సోదరుల దీపాల పండుగ

విజయనగరం టౌన్: హజరత్ జిందేషా మదార్ ఔలియా చందోత్సవం సందర్భంగా చిరాఖ లపూజా (దీపాల పండుగ) ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూల్‌భాగ్ దారిలో ఉన్న మసీద్‌లో మహ్మద్ ఇక్బాల్ షేక్ యాసిన్ సయ్యద్ నిజామ్, పూజారి మహ్మద్ జావిద్ రజా మహ్మద్ యూనస్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు.

వాతావరణ హెచ్చరిక..!

● రైతులను అప్రమత్తం చేసిన వ్యవసాయశాఖ



సీతానగరం: జోగింపేటలో పత్తిపంటను పరిశీలిస్తున్న డీఏఓ రాబర్ట్‌పాల్

సీతానగరం: 'మిచాంగ్ తుఫాన్' హెచ్చరికల నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జోగింపేట, సూరంపేట, చినబోగిలి, సీతానగరం గ్రామాల్లో పంట పొలాల్లో రైతులు చేస్తున్న పనులను, ఆర్బీకేలకు ధాన్యం నిల్వల తరలింపు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జోగింపేటలో పత్తి, వరిపంటలను పరిశీలించిన అనంతరం రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల కేంద్రం జారీచేసిన ఉత్తర్వుల మేరకు రైతులు ఇంతవరకూ కోసిన పంటకు తడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పత్తి పికింగ్ దశలోఉన్నందున తుఫాన్ రావడానికి ముందుగానే పత్తి తడిచిపోకుండా భద్రపర్చుకోవాలని రైతులను కోరారు. అలాగే కోతకోసిన వరిపంట తుఫాన్ బారిన పడి తడిసిపోకుండా కుప్పలు వేసుకోవాలని సూచించారు. పండిన చేలు వర్షానికి ప్రభావమయ్యే అవకాశం ఉన్నందున కోయవద్దన్నారు. ఇంతవరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, కళ్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలు మిల్లుకు తరలించడానికి జీపీఎస్ చేసిన వాహనాలు సమకూర్చినట్లు చెప్పారు. రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఓ ఎస్ అవినాష్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు. అలాగే తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల



పాచిపెంట: తుఫాన్‌పై సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

మేరకు ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికలపై రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు మండల పశువైద్యాధికారి ఎస్ రామారావు, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, పీహెచ్‌సీ డాక్టర్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉందాం

పాచిపెంట: తుఫాన్ ప్రభావం నేపథ్యంలో అధికారులందరం అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ లక్ష్మీకాంత్, తహసీల్దార్ రాజశేఖర్‌లు అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో వారు ఆదివారం సమావేశం నిర్వహించారు. తుఫాన్ రానున్న నేపథ్యంలో శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, తుఫాన్ నష్ట తీవ్రత తగ్గించేలా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా యంత్రాంగం

పార్వతీపురం: నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ సోమవారానికి తుఫాన్‌గా బలపడనుందని ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్ని శాఖలను అప్రమత్తం చేశారు. మిచాంగ్ తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. నాలుగు రోజులు తుఫాన్ ప్రభావం ఉంటుందని ప్రజలు, రైతులకు గ్రామాలలో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. తుఫాన్ దృష్ట్యా అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌సీ, సీహెచ్‌డబ్ల్యూలతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో 08963-293046, పార్వతీపురం ఆర్‌డీఓ కార్యాలయంలో 8500525011, పాలకొండ ఆర్‌డిఓ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ 9502722212లను ఏర్పాటుచేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండాలని, ప్రజలు వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విపత్తులు సంభవించే అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగా గుర్తించేలా సిబ్బందికి ఆదేశించారు. తుఫాన్ తీవ్రతను బట్టి పాఠశాలలకు సెలవులు ఇచ్చేలా ఆదేశాలను జారీచేశారు. ఈ మేరకు పోలీసులు, రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదం సంభవించే ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు.



పార్వతీపురంలోని సాకిగెడ్డను పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై దినకర్

ఓటుహక్కు కోసం ప్రత్యేక క్యాంపెయిన్



126 పోలింగ్ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పవన్‌కుమార్

సీతానగరం: మండలంలో అర్హులైన వారందరికీ ఓటుహక్కు కల్పించడానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు స్పెషల్ డ్రైవ్ రెండవ రోజు జరిగిందని సూపర్‌వైజర్ ఆర్.పవన్ కుమార్ అన్నారు. ఓటర్లు, సవరణలు, చేర్పుల ప్రత్యేకడ్రైవ్‌ను పురస్కరించుకుని ఆదివారం 124,125,126 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జనవరి1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటుహక్కు కల్పిస్తామని, ఓటుహక్కు కావలసిన వారికి బీఎల్వోల వద్ద ఫారాలున్నాయని తెలియజేశారు. అలాగే దీర్ఘకాలం గ్రామాంతరం వెళ్లిన వారి వివరాలను సేకరించి పేర్ల తొలగింపు దరఖాస్తులు స్వీకరించాలని బీఎల్వోలను కోరారు. అలాగే మృతిచెందిన వారి వివరాలను సేకరించి ఓటర్ల జాబితానుంచి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో జె.దామోదర్‌నాయుడు, బీఎల్వోలు పాల్గొన్నారు.

నేడు బత్తిలికి డిప్యూటీ సీఎం రాక

భామిని: మండలంలోని బత్తిలి గ్రామానికి డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర సోమవారం రానున్నారు. గ్రామంలో కొత్తగా రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన మోడల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఆయన ప్రారంభించనున్నట్లు బత్తిలి ఎస్ఐ యతిరాజుల అమ్మానరావు ఆదివారం తెలిపారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

వీరఘట్టం: మిచౌంగ్ తుపాను నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తక్షణమే అధికార యంత్రాంగం స్పందిస్తుందని తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. ఎక్కడ ఏం విపత్తు జరిగినా ఫోన్ నంబర్ 9618425030ను సంప్రదించాలని కోరారు.

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో తుపాను కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రమాదాలు జరిగినా, ప్రమాదాల బారినపడినా రక్షణ చర్యల కోసం ఫోన్ నంబర్ 08941294040ను సంప్రదించాలన్నారు.

'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'

భామిని: మండలంలోని నేరడి-బి, కీసర గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎ.ఉమామహేశ్వరి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ సందేశం వినిపించి, దేశాభివృద్ధికి సహకరిస్తామని వారితో చెప్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు.

చురుగ్గా రేషన్ పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో రేషన్ సరుకుల పంపిణీ చురుగ్గా కొనసాగుతోంది. ఆదివారం ఎండీయూ వాహనాల ద్వారా పలు ఇళ్ల వద్దకు వెళ్లి, లబ్ధిదారులకు రేషన్ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీఆర్వో బి.కృష్ణ పరిశీలించారు. సక్రమంగా రేషన్ సరఫరా చేయాలని, నిర్దేశిత సమయంలోగా పంపిణీ పూర్తి చేయాలని సూచించారు.

వైకల్యం శరీరానికే..మనసుకు కాదు



చిన్నారికి స్వెట్టర్ అందిస్తున్న సర్పంచ్ వెంకటరత్నం

మక్కువ: దివ్యాంగత్వం శరీరానికే తప్ప మనసుకు కాదని వెంకటభైరిపురం సర్పంచ్ మరడ వెంకటరత్నం అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వెంకటభైరిపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా జరిగింది. ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత మరడ శ్రీనివాసరావు 15 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చలి కాలంలో ఉపయోగించే నాణ్యత గల స్వెటర్లు వితరణ చేయగా సర్పంచ్ వెంకటరత్నం ముందుగా చిన్నారులకు వాటిని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఎంతోమంది దివ్యాంగులు అనేక రంగాల్లో ఇప్పటికే రాణిస్తున్నారని, అటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని వారిలాగానే ఉన్నత స్థానాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం మర్రాపు రామకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులను అందరూ సామాన్య మానవుల్లాగానే ప్రేమతో అక్కున చేర్చుకోవాలని సమాజంలో వారికి తగిన గుర్తింపును ప్రతి ఒక్కరూ కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుడు రాయిడి శంకరరావు ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు సౌకర్యాలు పథకాలు వారికి రావలసిన వివిధ మినహాయింపుల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు పెద్దలు అందరూ కూడా పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

కచ్చితమైన ఓటరు జాబితాయే లక్ష్యం

● ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: కచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి సూచించారు. మండలంలోని పెద రామ, దేవనాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆమె ఆదివారం పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణపై బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో సురక్షిత పాలనకు ఓటే వజ్రాయుధమని, ఓటుహక్కు నమోదుపై ప్రత్యేకదృష్టి సారించాలని తెలిపారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీయువకులంతా ఓటుహక్కు నమోదు చేసుకునేలా చూడాలన్నారు.

భామిని: మండలంలోని కొరమ, పెద్దదిమిలి, ఘనసర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కొత్త ఓటర్ల నమోదుపై వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాత ఓటరు జాబితాలో మరణించిన ఓటర్లు, శాశ్వతంగా గ్రామం విడిచి వెళ్లిన వారి ఓట్లను తొలగించాలని సిబ్బందికి సూచించారు. బీఎల్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయడంతో పాటు కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారి వివరాలు తీసుకుని, ఓటు వచ్చేలా చూడాలన్నారు.



గుమ్మలక్ష్మీపురంలో ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాములమ్మ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని 73, 74వ పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జె.రాములమ్మ ఆదివారం సందర్శించి, అక్కడ చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల నమోదును పరిశీలించారు. అర్హులైన వారంతా ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంఈవో బి.జనార్దన్‌నాయుడు తదితరులు ఉన్నారు.



భామిని: పెద్దదిమిలిలో ఓటరు నమోదుపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నాయకులు

● ఉపముఖ్యమంత్రికి వినతి

సాలూరు: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఆశ్రమ, జీపీఎస్ (ట్రైబల్ వెల్ఫేర్) ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరను గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం వారు ఉపముఖ్యమంత్రిని పట్టణంలోని ఆయన గృహంలో కలిశారు. ఈ సందర్భంగా వారు అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి. భాషా పండితులు, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలి. సీనియర్ ఉపాధ్యాయులకు నోషనల్ సీనియారిటి కల్పించాలి. ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ రాజన్నదొరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నీలకంఠం, లచ్చయ్య, సూర్యనారాయణ, సుబ్బారావు, ప్రసాద్, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయి పనుల పరిశీలన



చినభోగిలిలో పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్

సీతానగరం: మండలంలోని 3 గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 86 లక్షలతో ఇంటింటి కుళాయిల పనులు నిర్దేశించిన గడువులోగా నిర్వాహకులు పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన చినభోగిలి, అప్పయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి కుళాయి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చినభోగిలిలో రూ.24 లక్షలతో 250 ట్యాప్‌ల నిర్మాణానికి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలియజేశారు. అలాగే పెదభోగిలి పంచాయతీ అప్పయ్యపేటలో రూ.31 లక్షలతో 400 ట్యాప్‌లు, మరిపివలసలో రూ.31 లక్షలతో 300 ట్యాప్‌ల పనులకు ఇప్పటికే ప్రధాన పైప్‌లైన్లు వేయడం, ట్యాప్‌లు అమర్చడం తదితర పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. అందరికీ సమానంగా తాగునీరు సరఫరా చేసే విధంగా కుళాయిలు వేస్తున్నట్లు చెప్పారు. అలాగే సీతానగరంలో రూ.55 లక్షలతో ఇంటింటి కుళాయి పనులు జరుగుతున్నాయని తెలిపారు. నిర్వాహకులు ఇంటింటి కుళాయిల పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బి.శ్రీరాములు నాయుడు, ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



వంతెన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: నగరపంచాయతీలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదేశించారు. స్థానిక పట్టణంలోని పెదకాపు వీధి దగ్గరలో రూ.40 లక్షల వ్యయంతో చేపడుతున్న వంతెన నిర్మాణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఇక్కడి నాలుగు వార్డుల ప్రజలకు అత్యవసరమైన ఈ వంతెన పనులను ఇదే నెలలో పూర్తి చేయాలని సూచించారు. అలాగే పట్టణ వ్యాప్తంగా పలుచోట్ల జరుగుతున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, దుప్పాడ పాపినాయుడు, కిల్లారి మోహన్, కడగల రమణ, కొంచాడ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



అధికారులకు సూచనలిస్తున్న ఆర్‌డీవో లావణ్య

భామిని: తుపాను నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని పాలకొండ ఆర్‌డీవో లావణ్య సూచించారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆమె మిచాంగ్ తుపాను కారణంగా ఎటువంటి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో తలెత్తే ఇబ్బందులు ముందుగానే గుర్తించి, వాటిని ప్రజలకు వివరించి, ఎటువంటి నష్ట జరగకుండా గ్రామ వలంటీర్లతో అవగాహన కల్పించాలన్నారు. అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రమాదాల బారినపడకుండా ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, డీటీ నిమ్మల శేఖరం, ఈవోపీఆర్‌డీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిని కలిసిన కుమ్మరి కులస్తులు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగిలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిని కుమ్మరి వర్గానికి చెందిన పలువురు ఆదివారం కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న మట్టికి గాను వసూలు చేస్తున్న చార్జీలు రద్దు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ట్రాక్టర్ మట్టి కోసం రూ.325 చొప్పున అధికారులు వసూలు చేస్తున్నారని, దీంతో చార్జీలు భారమవుతున్నాయన్నారు. మట్టినే నమ్ముకుని జీవిస్తున్న తమపై చార్జీల భారం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శాలివాహన సంఘ కుమ్మరి కులస్తులు ఉరిటి యాదవ్, సింహాచలం, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాకోడులో గ్రామసభ

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడులో 2023-24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆదివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన సభలో సోషల్ ఆడిట్ బృందం పనులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సర్పంచ్ పాటిపి రెడ్డి వెంకటరమణ, అశోక్ పాల్గొన్నారు.